
సాక్షి
బాపట్ల
శనివారం । 7 । డిసెంబర్ । 2024



పోస్టర్ ఆవిష్కరణ
నరసరావుపేట: స్థానిక కలెక్టరేట్‌లో బాల్య వివాహాల నిర్మూలన కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు శుక్రవారం ఆవిష్కరించారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 585.90 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,221 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వెండి బహూకరణ
పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో గల వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి శుక్రవారం వ్యాపారి పెరుమళ్ల రాజేష్, లక్ష్మీ వనజ దంపతులు 15 కేజీల వెండిని అందించారు.

తల్లికి వంచన!

తల్లికి వందనం అంటూ రాష్ట్రంలోని మహిళలను ముఖ్యమంత్రి చంద్రబాబు వంచించారు. ఎన్నికలకు ముందు ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేలు ఇస్తాం అంటూ హామీలు గుప్పించారు. అధికారం చేపట్టి ఆరు నెలలైనా తల్లికి వందనం ఊసే లేదు. దీంతో అనేక మంది పేద పిల్లలు చదువుకు దూరమయ్యారు. అంతేగాక జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు మరిచారు. హామీలు అమలు చేయాలని ముఖ్యమంత్రి అయిన తర్వాత తొలిసారి జిల్లాకు వస్తున్న చంద్రబాబుకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



- సూపర్ సిక్స్ పేరుతో 66 హామీలు
- అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైనం
- మాట నిలుపుకోవాలంటున్న జనం
- తొలిసారి నేడు బాపట్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక



వేమూరు నియోజకవర్గంలో బలహీనంగా ఉన్న కృష్ణా కరకట్ట

సాక్షి ప్రతినిధి,బాపట్ల: అధికారం కోసం కుప్పలు తెప్పలుగా హామీలు ఇచ్చి జనాన్ని మభ్యపెట్టి ఓట్లేయించుకున్న కూటమి నేతలు గద్దెనెక్కాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారు. పట్టుమని ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చలేదు. ఆరు నెలల పాలన ముగుస్తున్నా హామీల అమలుకు ఏ మాత్రం ప్రయత్నించలేదు. పైగా వాటి ఊసే ఎత్తడం లేదు. సార్వత్రిక ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో సూపర్‌సిక్స్ పేరుతో కూటమి 66 హామీలు ఇచ్చింది. వాటితోపాటు జిల్లాకు సంబంధించి చంద్రబాబు, లోకేష్, పవన్‌కళ్యాణ్‌లతోపాటు స్థానిక అభ్యర్థులు, నేతలు లెక్కలేనన్ని హామీలు గుప్పించారు. ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టాక ప్రజలకిచ్చిన హామీల సంగతి గాలికొదిలి ఇసుక, బుసక, గ్రావెల్, గ్రానైట్, మద్యం అమ్ముకుంటూ పచ్చనేతలు సొంత లాభం చూసుకుంటున్నారు. అటు ప్రభుత్వం సైతం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే ప్రయత్నం చేయడంలేదు. కూటమి సర్కారు తీరుపై ప్రజలు మండిపడుతున్నారు.

అన్నదాతకు అందని 'సుఖీభవ'

ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రకటించింది. జిల్లాలో 1,92,037 మంది రైతులకు రూ.384.07 కోట్లు ఇవ్వాల్సివుంది. ఖరీఫ్ సంగతి దేవుడెరుగు ఏడాది ముగుస్తున్నా ఒక్కరూపాయి కూడా రైతులకు జమచేయలేదు. మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జిల్లాలోని 1,92,037 రైతులకు రూ.1181కోట్లు ఇచ్చారు.

తల్లికి వందనమేదీ?

ఎన్నికల ముందు తల్లికి వందనం కింద పిల్లల చదువులకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ. 15 వేలు చొప్పున ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికి ఇస్తామన్నారు. గత ప్రభుత్వంలో కుటుంబానికి ఒక్కరు చొప్పున 1,16,019 మందికి రూ.174.02 కోట్లు ఇచ్చారు. ఇప్పుడు నలుగురు సంగతి దేవుడెరుగు కుటుంబానికి ఇద్దరు చొప్పున ఇచ్చినా రూ.350 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. అయినా పైసా ఇవ్వలేదు.

అన్ని హామీలకూ మంగళం

ఎన్నికల్లో కూటమి నేతలు అధికారంలోకి రావాలన్న ఏకైక లక్ష్యంతో కుప్పలు తెప్పలుగా హామీలు కురిపించారు. డ్వాక్రా సంఘాలకు రూ.10 లక్షల రుణాలు ఇస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమన్నారు. బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లలో లక్షన్నర కోట్లు, స్వయం ఉపాధికి రూ.10 వేల కోట్లు, రూ.5వేల కోట్లతో ఆదరణ పథకం పునరుద్ధరణ, క్వారీల్లో వడ్డెరలకు 15 శాతం రిజర్వేషన్, రాయల్టీ, సీనరేజ్‌ల్లో మినహాయింపు, దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ.25 వేల జీతం, రైతు కూలీలకు కార్పొరేషన్లు, 90 శాతం సబ్సిడీతో బిందుసేద్యం, ట్రాన్స్‌ఫార్మర్ల ధరల తగ్గింపు, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రూ. 5 లక్షల వడ్డీలేని రుణాలు, ఆటో, ట్యాక్సీ, లారీ, టిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ.15వేలు, డ్రైవర్ల సాధికార సంస్థ, డ్రైవర్ల పిల్లలకు విద్యారుణాలు, బీసీ సబ్‌ప్లాన్, ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్ల ఖర్చు, స్వర్ణకారుల అభివృద్ధికి కార్పొరేషన్, అంటూ చాలా చెప్పారు. మొత్తంగా 66 హామీలను ఇచ్చారు.

జిల్లాలో హామీల పరంపర



కొరిశపాడు ఎత్తిపోతల పథకం

బాపట్ల, రేపల్లె, అద్దంకితోపాటు అన్ని నియోజకవర్గాల్లో వంద పడకల ఆసుపత్రులు, తాగునీటి పథకాలు, డంపింగ్ యార్డుల ఏర్పాటు, జిల్లా వ్యాప్తంగా రహదారుల అభివృద్ధి, బాపట్ల, చీరాల, పర్చూరు, అద్దంకి ప్రాంతాల్లో కృష్ణా, సాగర్ కాలువల ఆధునికీకరణ, లిఫ్ట్ స్కీములు, తీరంలో తుపాను షెల్టర్ల నిర్మాణం, పర్యాటక అభివృద్ధికి మరిన్ని పథకాలు, అద్దంకిని ప్రకాశం జిల్లాలో కలుపుతామన్నారు. అద్దంకి నియోజకవర్గంలోని కొరిశపాడు, తమ్మవరం-2 ఎత్తిపోతల పథకాలను పూర్తి చేస్తామన్నారు. వేమూరు నియోజకవర్గంలో తాడిగిరిపాడు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తామన్నారు. కృష్ణా కరకట్టను ఆధునికీకరించి వరద ప్రమాదాలను నివారిస్తామన్నారు. వీటితోపాటు వందలాదిగా హామీలు ఇచ్చారు. ఇప్పటివరకూ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఆ దిశగా పాలకుల చేతలు కూడా లేవు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను పట్టించుకోక వంచించడంపై జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న విద్యార్థులు , తల్లిదండ్రుల సమావేశానికి శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు బాపట్లకు వస్తున్న నేపథ్యంలో హామీలను గుర్తుకు తెచ్చుకుంటున్న ప్రజలు వాటిని ఎప్పుడు నెరవేరుస్తావంటూ ప్రశ్నిస్తున్నారు.

కొత్త పింఛన్లు మంజూరు కలే!

జిల్లాలో 2,35,791 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం పాత పింఛన్‌దారులకు మాత్రమే పింఛన్ ఇచ్చి మిగిలిన వారికి ఎగనామం పెట్టింది.

నేడు బాపట్లలో ట్రాఫిక్ మళ్లింపు



జిల్లా ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా శనివారం బాపట్ల పట్టణంలో ట్రాఫిక్ మళ్లింపు చేపట్టినట్లు ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. శుక్రవారం ట్రాఫిక్ మళ్లింపుపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు.

వాహనాల దారి మళ్లింపు వివరాలు:

- చీరాల నుంచి బాపట్ల మీదుగా పొన్నూరు, గుంటూరు వైపు వెళ్లే వాహనాలను, అంబేడ్కర్ సర్కిల్, జమ్ములపాలెం ఫ్లైఓవర్, ఉప్పరపాలెం ఇందిరాగాంధీ సర్కిల్, దర్గా మీదుగా దారి మళ్లిస్తున్నారు.
- బాపట్ల నుంచి కర్లపాలెం, చెరుకుపల్లి, రేపల్లె వైపు వెళ్ల వాహనాలను గడియార స్తంభం సెంటర్, రాష్ట్రీయ రహదారి 216 మీదుగా దారి మళ్లిస్తున్నారు.
- గుంటూరు, పొన్నూరు వైపు నుంచి బాపట్ల పట్టణంలోకి వచ్చే వాహనాలను గుంటూరు ఫ్లైఓవర్ కుడి వైపు నుంచి కలెక్టర్ బంగ్లా, దర్గా, ఉప్పరపాలెం రైల్వే గేట్, ఉప్పరపాలెం ఇందిరాగాంధీ సర్కిల్, జమ్ములపాలెం ఫ్లైఓవర్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా దారి మళ్లించారు.
- రేపల్లె, చెరుకుపల్లి, కర్లపాలెం వైపు నుంచి బాపట్ల పట్టణంలోకి వచ్చే వాహనాలు రాష్ట్రీయ రహదారి 216 మీదుగా సూర్యలంక రోడ్డులోకి వచ్చి గడియార స్తంభం సెంటర్ మీదుగా దారి మళ్లించారు.
- ఉప్పరపాలెం రైల్వే గేట్, ఆర్ అండ్ బీ బంగ్లా మీదుగా మున్సిపల్ ఉన్నత పాఠశాల వైపు వచ్చు వాహనాలు ఉప్పరపాలెం ఇందిరాగాంధీ సర్కిల్, జమ్ములపాలెం ఫ్లైఓవర్ మీదుగా దారి మళ్లించారు.
- ఆర్ అండ్ బీ బంగ్లా మీదుగా ఉప్పరపాలెం వైపు వెళ్లే వాహనాలను పాత బస్టాండ్ సెంటర్, గడియార స్తంభం సెంటర్, జమ్ములపాలెం ఫ్లైఓవర్, రైల్వే ట్రాక్ ప్రక్క నుంచి ఉప్పరపాలెం ఇందిరాగాంధీ సర్కిల్ మీదుగా దారి మళ్లిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సీఎం పర్యటన ముగిసే వరకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని తెలిపారు.

న్యూస్‌రీల్

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



తెనాలిరూరల్: మండలంలోని పెదరావూరు గ్రామంలోని అభయ హస్త సుబ్రహ్మణ్యేశ్వస్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్వామి వారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్ ఉటుకూరు శుక్రవారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ నిర్వాహకులు న్యాయమూర్తికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. డాక్టర్ చింతలపాటి పూర్ణానందశాస్త్రిని న్యాయమూర్తి, దేవస్థాన నిర్వాహకులు సత్కరించారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీసుబ్రహ్మణ్య వాక్యార్థ సభ నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు చండీహోమం, సువాసినీ పూజ చేపట్టారు.

కలెక్టర్ల సమావేశం ఏర్పాట్లు పరిశీలన

తాడికొండ: ఈనెల 10, 11వ తేదీలలో రాష్ట్ర సచివాలయం బ్లాక్-5లో జరగనున్న కలెక్టర్‌ల సమావేశానికి సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లను శుక్రవారం గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులతో కలిసి పరిశీలించారు. వాహనాల పార్కింగ్, సెక్యూరిటీ, భోజన ఏర్పాట్లపై తగు సూచనలు జారీ చేశారు. అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. రెండు రోజులపాటు జరిగే జిల్లా కలెక్టర్ల సమావేశానికి సంబంధించిన డ్యూటీలు కేటాయించిన అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.శ్రీనివాసరావు, ప్రొటోకాల్ డైరెక్టర్ మోహనరావు, డీఎస్‌వో కోమలి పద్మ, సీసీఓ శేషశ్రీ , జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, డీఐవో బిమల్ కుమార్, తుళ్లూరు తహసీల్దార్ సుజాత, సచివాలయ ప్రొటోకాల్ అధికారులు పాల్గొన్నారు.

శివాలయంలో హుండీ కానుకలు లెక్కింపు



పెదకాకాని: శివాలయంలో మల్లేశ్వరస్వామి ఆలయానికి ఆదాయం గణనీయంగా పెరిగినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాస్ తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం హుండీల కానుకలు లెక్కించారు. పర్యవేక్షణాధికారిగా పాతగుంటూరు అగస్త్యేశ్వరస్వామి ఆలయ ఈఓ ఎస్ఎల్‌టీ సౌమ్య విచ్చేశారు. కళ్యాణమండపంలో లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. 46 రోజులకుగాను రూ.56,14,083 వచ్చాయి. అన్నప్రసాద వితరణ హాల్‌లోని హుండీ ద్వారా రూ.3,36,386 సమకూరింది. బంగారం 30.90 గ్రాములు, వెండి 259 గ్రాములు, విదేశీ కరెన్సీ 55 డాలర్లు వచ్చాయి. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, కెనరా బ్యాంకు మేనేజరు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. పెదకాకాని పోలీసులు బందోబస్తు పర్యవేక్షించారు.

9న బీటెక్, బీఎస్సీ కోర్సులకు కౌన్సెలింగ్

గుంటూరురూరల్:ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 9వ తేదీన స్పాట్ రిజిస్ట్రేషన్, స్పాట్ మాన్యువల్ కౌన్సెలింగ్‌ను విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు నగర శివారు లాంఫాం నందున్న వర్సిటీ ఆడిటోరియంలో నిర్వహిస్తామని తెలిపారు. ఏపీ ఈఏపీసెట్ 2024 లో ర్యాంక్ పొందిన ప్రతి విద్యార్థి హాజరవ్వవచ్చని పేర్కొన్నారు. వివరాలకు ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

పులిచింతల ప్రాజెక్టును సందర్శించిన పల్నాడు ఎస్పీ



అచ్చంపేట: ఆంధ్రా, తెలంగాణ సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టును పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్టు వద్ద భద్రతా చర్యలు పర్యవేక్షించారు. ఇంజినీర్ల నుంచి వివరాలు సేకరించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఎస్పీ అచ్చంపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



డాక్టరు అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

బాపట్ల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా జమ్ములపాలెం రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎన్నో ఇబ్బందులు, సమస్యలు ఎదుర్కొన్నప్పటికీ ఆగిపోకుండా ధైర్యసాహసాలతో జీవితాన్ని కొనసాగించారన్నారు. కులవివక్షపై ఆ రోజుల్లో అనేక పోరాటాలు సాగించారన్నారు. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లి బారిస్టర్ స్థాయికి ఎదిగారన్నారు. భారతదేశంలో జరిగిన స్వాతంత్ర ఉద్యమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రముఖ పాత్ర పోషించి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. భారతదేశంలో జరుగుతున్న సామాజిక రుగ్మతలపై పోరాటం చేసి వెనుకబడిన వర్గాల ప్రజలకు దారి చూపిన దార్శనికుడని అన్నారు. అన్ని మత గ్రంథాల కంటే భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని అన్నారు. బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ భారతదేశంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి కోసం అనేక సంస్కరణలు చేపట్టారని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ భారతదేశంలో జన్మించడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. డాక్టర్ అంబేడ్కర్ చేపట్టిన సంస్కరణలు రాబోయే తరాలు కూడా స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బాపట్ల ప్రఖర్ జైన్, బుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్‌దేబొరా, షెడ్యూల్ కులాల సంఘ నాయకులు పాల్గొన్నారు.

మద్దతు ధరకోసం మిర్చి రైతుల ఆందోళన

- నామ్ రహదారిపై బైటాయించిన రైతులు
- దళారులు మోసగిస్తున్నారని రైతుల ఆవేదన
- ట్రాఫిక్ క్లియర్ చేసిన పోలీసులు



నామ్ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ఆరుగాలం కష్టించి పండించిన పంటను తక్కువ ధరకు దళారులు గద్దల్లా తన్నుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ మిర్చి రైతులు రాస్తారోకో చేశారు. సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు మిర్చి, పత్తి రైతులు శుక్రవారం రాత్రి నామ్ రహదారిపై గిట్టుబాటు ధర కల్పించాలని నినాదాలు చేస్తూ వాహనాల రాకపోకలు స్తంభింపచేశారు. రైతు నాయకులు, సీపీఐ మండల కార్యదర్శి ఖాదర్ బాషా మాట్లాడుతూ మండలంలోని కొమ్మాలపాడులో సుమారు 400 ఎకరాల వరకు రైతులు పచ్చిమిర్చి పండిస్తున్నారు. పంటను కొనుగోలు చేసేందుకు వచ్చే దళారులు పది కిలోల మిర్చి రూ.300 వరకు రేటు పలుకుతుంటే దళారులంతా సిండికేట్‌గా ఏర్పడి ధర రాకుండా అడ్డుతగులుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పది కిలోల మిర్చి రూ.100 లేక రూ.120 కొనుగోలు చేసి మోసగిస్తున్నారన్నారు. ఇంత మోసం జరుగుతున్నా మార్కెటింగ్ శాఖ, ప్రభుత్వ అధికారులు కాని కన్నెత్తి చూడటం లేదని వాపోయారు. ఎరువుల దుకాణ డీలర్లు, దళారులు కుమ్మక్కై ధర రాకుండా చేస్తున్నారని, ప్రభుత్వం జోక్యం చేసుకుని మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రాఫిక్ నిలిచిపోవటంతో ఎస్సై సిబ్బంది అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతు సంఘాలు ప్రజలను కూడగట్టుకొని మరింత ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.



రహదారిపై నిలిచిన వాహనాలు

అపరిష్కృత భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె రూరల్: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న భూ పరమైన సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మండలంలోని పేటేరు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలు సంస్కరణలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తమ ప్రభుత్వం తప్పక అమలు చేస్తుందన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శేషగిరిరావు, ఆర్డీఓ రామలక్ష్మి, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎం.శోభారాణి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల భద్రత బాధ్యత అధికారులదే

\- జిల్లా కలెక్టర్ వెంకట మురళి



పాత రెవెన్యూ రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్, పక్కన ఆర్డీఓ, తహసీల్దార్

చీరాలటౌన్: ఏళ్ల తరబడి పరిష్కారం కాని భూ సమస్యలన్నింటిని పరిష్కరించేందుకే 'మీ భూమి-మీ హక్కు' రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని జిలా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. శుక్రవారం మండలంలోని గవినివారిపాలెం గ్రామంలో రెవెన్యూ సదస్సులను కలెక్టర్ ప్రారంభించారు. గ్రామ సచివాలయం వద్ద ప్రారంభించిన సదస్సుకు ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం చేయడంతోపాటు భూ సమస్యల నుంచి విముక్తులను చేసేందుకే ప్రభుత్వం ప్రత్యేకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. పాతబడిన రెవెన్యూ రికార్డులను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. ఎంతో విలువైన దస్త్రాలను భద్రంగా ఉంచడంతోపాటుగా భవిష్యత్ తరాలకు ఇబ్బందులు లేకుండా భద్రపరచాలన్నారు. కీలకమైన రెవెన్యూ రికార్డులను భద్రంగా ఉంచాల్సిన అధికారులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామస్థాయిలో ఉన్న అన్నీ రకాల భూ సమస్యలన్నింటిని సత్వరం పరిష్కారం చేసేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం

గవినివారిపాలేనికి చెందిన 25 వేల ఎకరాల భూములకు సంబంధించిన రికార్డులను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. శతాబ్దం నాటి రెవెన్యూ రికార్డుల్లో కొన్ని చిందరవందరగా ఉండటంతో రెవెన్యూ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి పలు అర్జీలను స్వీకరించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో కలెక్టర్ పర్యటించి ప్రజల నుంచి నేరుగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉండటంపై పీఆర్ అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు తమ విధులను సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజారోగ్యానికి భంగం వాటిల్లేలా ఉదాసీనంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్‌నాయుడు, ల్యాండ్స్ అండ్ సర్వే ఏడీ జి.ముసలయ్య, తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ, మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, ఎంపీడీవో శివసుబ్రమణ్యం, డిప్యూటీ తహసీల్దార్ దేవతోటి అర్జున్, వీఆర్వోలు, పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



బల్లికురవ: ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా తనపని తానుచేసుకుంటున్న కొయ్యలమూడి మరియమ్మ (110) శుక్రవారం మృతిచెందింది. ఈమె భర్త ఏసోబు (110) పదేళ్ల కిందట మంచం పట్టకుండానే ముందు రోజు వరకు తిరుగుతూ హఠాత్తుగా మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొప్పరపాలెం గ్రామానికి చెందిన కొయ్యలమూడి మరియమ్మకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలతో కలిసి సుమారు 60 మంది వరకు కుటుంబ సభ్యులు ఉన్నారు. ఇటీవలే అందరూ కలిసి వేడుక జరుపుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల ఆశ్రునయనాల మధ్య సాయంత్రం మరియమ్మ అంత్యక్రియలు ముగించారు.

మాత్ర వికటించి చిన్నారి మృతి

కొత్తమల్లాయపాలెంలో విషాద ఛాయలు



చనిపోయిన డింపుల్‌కు అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

బల్లికురవ: బతుకుదెరువుకు రాష్ట్రాలు దాటి వలస వచ్చిన కుటుంబంలో ఆడుతూ పాడుతూ తిరుగుతున్న చిన్నారికి కడుపునొప్పి రావటంతో స్థానిక ఆరోగ్య కార్యకర్త ఇచ్చిన మాత్ర వేయగానే అది వికటించటంతో వైద్యం అందేలోపు చనిపోయింది. వివరాల్లోకి వెళితే... కర్ణాటక రాష్ట్రం నుంచి మంగేస్, రంజిత దంపతులు 20 ఏళ్ల కిందట బాపట్ల జిల్లా బల్లికురవ మండలం ఈర్లకొండ క్వారీలో పని చేసేందుకు వలస వచ్చారు. కొత్తమల్లాయపాలెం గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరికి డింపుల్ అనే 5 సంవత్సరాల బాలిక ఉంది. గురువారం కడుపునొప్పిగా ఉండటంతో స్థానిక ఆరోగ్య కార్యకర్తలను కుటుంబ సభ్యులు సంప్రదించగా మందు బిళ్ల ఇచ్చారు. ఆ మాత్ర వేసుకున్న కొద్దిసేపటికే ఆరోగ్యం విషమించింది. తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యుడి సూచన మేరకు మెరుగైన చికిత్సకు గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో గురువారం రాత్రి చనిపోయింది. చిన్నారి విగత జీవిగా మారటంతో ఆ కుటుంబంలో, తోటి కార్మికుల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. శుక్రవారం చిన్నారికి అంత్యక్రియలు ముగించారు. దీనిపై వైద్య సిబ్బందిని వివరణ అడగ్గా 15 రోజుల కిందట బాలిక తల్లికి ఆరోగ్యం బాగోలేనప్పుడు మాత్రలు ఇచ్చామే తప్ప.. బాలికకు మాత్రలు ఇవ్వలేదని చెబుతున్నారు.

క్లుప్తంగా

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

బాపట్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యే తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశంలో ఎలాంటి సమస్యలు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు అన్నారు. ముఖ్యమంత్రి సభ జరిగే బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విజయ రామరాజు, సమగ్ర శిక్ష అభియాన్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్‌లతో కలిసి శుక్రవారం పర్యటించారు. హెలి ప్యాడ్ నుంచి కాన్వాయ్, ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమంపై ట్రయల్ రన్ నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరయ్యే సమావేశ వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. పాఠశాలకు చేరుకోగానే విద్యార్థులే సంప్రదాయ దుస్తులతో ఆహ్వానం పలికేలా చూడాలన్నారు. విద్యార్థుల ప్రగతి పత్రాలపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించే తరగతి గదులను ముఖ్యమంత్రి పరిశీలిస్తారని తెలిపారు. ఆ తరగతి గదుల వద్దకు ఎన్‌సీసీ క్యాడెట్లు మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తూ సీఎంను తీసుకుని వెళ్లే కార్యక్రమం ట్రయల్ రన్ పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన జయప్రదం చేయడానికి విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలన్నారు. అధికారులంతా సమగ్ర ప్రణాళికతో కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

బిహార్‌కు చెందిన మహిళ

మేదరమెట్ల: బతుకుదెరువు కోసం వచ్చిన మహిళ కుటుంబ కలహాలతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శుక్రవారం కొరిశపాడు మండలం మేదరమెట్ల–అద్దంకి రోడ్డులోగల మసీదు సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. బిహార్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ సలీమా ఖాతుమ్ (28) తన భర్త వసీమ్‌తో కలసి పదేళ్లుగా మేదరమెట్లలో ఉంటున్నారు. భర్త గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తుంటాడు. ఇటీవల కాలంలో భార్యాభర్తల మధ్య ఏం జరిగిందో తెలియదు కానీ భర్త కొల్‌కత్తా వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం ఖాతూమ్ ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీన్ని గమనించిన ఇరుగుపొరుగు వారు మేదరమెట్ల పోలీసులకు సమాచారం అందజేశారు. అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి మృతురాలి భర్తకు ఫోన్ సమాచారం అందజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉదయం భర్తతో ఫోన్‌లో మాట్లాడిన తరువాతే ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. మృతురాలికి నాలుగేళ్ల పాప ఉంది.

ముగిసిన జిల్లా పురుషుల కబడ్డీ జట్టు శిక్షణ

ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక



ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల కబడ్డీ జట్టు

చినగంజాం: జిల్లా పురుషుల కబడ్డీ జట్టు శిక్షణ కార్యక్రమం ముగిసినట్లు ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సిరిగిరి రంగారావు తెలిపారు. చినగంజాం ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జట్టు ఎంపిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 71వ ఆంధ్ర రాష్ట్ర స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు ఈనెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు సూదులగుంట ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంతనూతల పాడులో నిర్వహించనున్నారు. ఈ దృష్ట్యా పోటీలో పాల్గొనబోయే ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. గత నెల 24వ తేదీ ఒంగోలులోని పర్వతరెడ్డి ఆనంద్ ఇండోర్ స్టేడియంలో ఎంపికలు నిర్వహించి మొత్తం 18 మందిని ఎంపిక చేశారన్నారు. వారికి నవంబరు 26వ తేదీ నుంచి డిసెంబరు 6 వరకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. చినగంజాం సుబ్బరామిరెడ్డి కళాశాల ఆవరణలో అంతర్జాతీయ క్రీడాకారుడు ఎం గిరిబాబు కోచ్‌గా జట్టుకు శిక్షణ ఇచ్చి అనంతరం వారిలో మెరుగైన ఆట ప్రదర్శించిన 12 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. శిక్షణ కాలంలో క్రీడాకారులకు భోజనం, ఇతర వసతులతోపాటు క్రీడా దుస్తులను చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ నల్లూరి సుబ్బారావు అందించారు. ఎంపిక కమిటీలో ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్, కార్యదర్శులతోపాటు సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సిరిగిరి రంగారావు, ఈదర వెంకట సురేష్‌బాబు, కబడ్డీ జాతీయ క్రీడాకారుడు పోకూరి శేషయ్య, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు బోగిరెడ్డి నాగాంజనేయులు పాల్గొన్నారు.

పురుషుల జట్టు..

పిట్టు బాలకృష్ణ, కాయల వెంకటేష్, గాలి లక్ష్మారెడ్డి, గునిమిని సమరసింహారెడ్డి, అసోది సుబ్బారెడ్డి, గాలి రామకృష్ణ, పెల్లేటి బ్రహ్మారెడ్డి, మంత్రు నాయక్, సోపర్ల మణి, గాలి లక్ష్మణ్, గొట్టు మల్లికార్జున్, కోట హరిప్రసాద్.

అర్బన్ హెల్త్ సెంటర్ పనితీరు బాగు



డాక్టర్ మానస తదితరులతో విజయభారతి

తాడేపల్లి రూరల్: ప్రకాష్‌నగర్ అంబేడ్కర్ నగర్ కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం నిర్మించిన ఈ హెల్త్ సెంటర్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. అనారోగ్య సమస్యలతో వచ్చిన వారిని అడిగితే వైద్యసేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ మానసను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ అదనపు డైరెక్టర్ శ్రీసంతోష్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ మానస మంజరి, డాక్టర్ శ్రీధర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ అనిల్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ రామోజీ నాయక్, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కళా ఉత్సవ్ పోటీలు

- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కళాకారులు
- విజేతలను అభినందించిన డీఈవో ఎల్ చంద్రకళ



విజేతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డైట్ లెక్చరల్ సుభాని

యడ్లపాడు: కళా ఉత్సవ్ 2024–25 జిల్లాస్థాయి పోటీలు ఘనంగా జరిగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యాశిక్షణ సంస్థ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం ఆరు విభాగాల్లో ఏర్పాటు చేయగా వాటిలో మూడింటిలో మాత్రమే విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానంగా జానపద గీతాలాపన, సంప్రదాయ నృత్యం, మైమ్‌షో విభాగాల్లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జానపదం విభాగంలో మున్నంగి జెడ్పీహైస్కూల్ బృందం, గుంటూరు వెంకటేశ్వర బాలకుటీర్ విద్యాసంస్థలు వరుసగా ప్రథమ, ద్వితీయస్థానాల్లో గెలుపొందాయి. సంప్రదాయ నృత్య విభాగంలో వేల్పూరు జెడ్పీ హైస్కూల్, గుంటూరు వెంకటేశ్వర బాలకుటీర్ విద్యాసంస్థలు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. మైమ్‌షోలో మాత్రం వేలూరు జెడ్పీ హైస్కూల్ ఒక్కటే ప్రథమ స్థానాన్ని గెలుచుకుంది. ఆయా పోటీలకు డైట్ లెక్చరల్ కె. ప్రసాద్, కె. అజయ్‌కుమార్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు డైట్ కళాశాల సీనియర్ లెక్చరల్ ఎస్ఎం సుభాని బహుమతి ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పల్నాడు జిల్లా డీఈవో ఎల్. చంద్రకళ నేతృత్వంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలందరికీ ఆమెతో పాటు అధ్యాపకులు అభినందించారు. బాలబాలికలు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అర్హతను సాధించడం ప్రశంసనీయమన్నారు. ఆయా పోటీల్లోనూ అద్భుత కళా నైపుణ్యాలు ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీల్లో స్థానం సంపాదించి, జిల్లాకు మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు.

కత్తెర పురుగుతో మొక్కజొన్నకు తీవ్ర నష్టం

డీఏవో మురళి



నరసరావుపేటరూరల్: కత్తెర పురుగు ఉధృతితో మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి తెలిపారు. మండలంలోని దొండపాడులో శుక్రవారం ఆయన పర్యటించారు. మొక్కజొన్న పంటలను పరిశీలించి, కత్తెర పురుగు ఉనికిని గుర్తించారు. లక్షణాలు, నివారణ చర్యలను రైతులకు తెలియజేశారు. గొంగళి పురుగు ముఖంపై తిరగబడిన వీ ఆకారంలో తెల్లని చారలను కలిగి ఉంటుందని తెలిపారు. గొంగళి పురుగు ఉదర భాగంలో ఆఖరి ఖండితంపై నల్లటి నాలుగు చుక్కలు చతురస్రాకారంలో ఉంటాయని వివరించారు. మొదటి దశలో ఆకులకు రంధ్రాలు చేస్తుందని, అవి నిలువుగా కనిపిస్తాయని తెలిపారు. పురుగు పెరిగే కొద్దీ ఆకుల చివరల నుంచి తింటూ కత్తిరించినట్టుగా ఉంటూ పూర్తిగా తినేస్తాయని వివరించారు. దుక్కులు లోతుగా దున్నుకోవడం వల్ల పురుగు నిద్రావస్థ, కోశస్థ దశలో నాశనం అవుతాయని సూచించారు. పంట చుట్టూ నాలుగు వరుసలు నేపియర్ గడ్డిని ఎరపంటగా వేసుకోవాలని తెలిపారు. ఐదు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకుని పురుగు ఉధృతిని గమనించాలని సూచించారు. నివారణకు 500 మి.లీ. క్లోరిపైరీఫాస్ లేదా 400 మి.లీ. క్వినాల్ ఫాస్‌ను మందును పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ నరేంద్రంబాబు, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు(గుంటూరుఈస్ట్): అప్పులపాలై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. గుంటూరు కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు... బాపట్ల జిల్లా ఈపూరుపాలెం గ్రామానికి చెందిన కట్టెం ధర్మరాజు (40) వైజాగ్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ అప్పులపాలయ్యాడు. కొద్దిరోజుల కిందట భార్యతో కలిసి చేబ్రోలులోని బంధువుల ఇంటికి వచ్చిన ధర్మరాజు గుంటూరు వెళుతున్నానని చెప్పి వచ్చాడు. గుంటూరులోని నాజ్‌సెంటర్‌లోని మహేంద్ర లాడ్జిలో అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నానని లేఖ రాసి ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఏపీ స్టేట్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్

గుంటూరువెస్ట్(క్రీడలు): నైట్ క్యాజిల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో 6 నుంచి 16 సంవత్సరాల వయస్సుగల బాలబాలికలకు ఏపీ స్టేట్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు పోటీల నిర్వాహకుడు వైవీకే చక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం జేకేసీ కాలేజ్ ఆఫ్ లా భవనంలో పోటీలు ఉంటాయని చెప్పారు. వివరాలకు 9063142105 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

యార్డులో 42,686 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 38,221 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 42,686 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 33,656 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు కార్యదర్శి తెలిపారు.

రూ. 3.5 కోట్ల విలువైన ఎర్రచందనం స్వాధీనం



మంగళగిరి: తమిళనాడుకు చెందిన ఇద్దరు నిందితుల నుంచి రూ.3.5 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. సినీ ఫక్కీలో పేపర్ బండిల్స్‌లో దుంగలు తరలిస్తున్నారనే సమాచారం మేరకు కాజ టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించి 49 దుంగలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవికుమార్, డీఎస్పీ భార్గవి, రూరల్ సీఐ వై శ్రీనివాసరావు , పట్టణ సీఐ డి వినోద్‌కుమార్, రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు టేబుల్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–15 బాల బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షులు నడింపల్లి వెంకట గురునాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ఆదివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. ఎంపిక చేసిన జిల్లా జట్లను ఈ నెల 20 నుంచి కాకినాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. వివరాలకు 93985 06170 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

డాక్టర్ అంబేడ్కర్ జీవితం ఆదర్శనీయం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఆర్.రామకృష్ణ

లక్ష్మీపురం: డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ జీవితం ఆదర్శనీయమని గుంటూరు రైల్వే డివిజనల్ డీఆర్ఎం ఆర్.రామకృష్ణ తెలిపారు. స్థానిక పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో నిర్వహించిన డీఆర్ఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక న్యాయాన్ని, మానవ హక్కులను ప్రోత్సహించడానికి అంబేడ్కర్ కృషిని గుర్తుంచుకోవాలన్నారు. ఏడీఆర్ఎం సైమాన్, అధికారులు పాల్గొన్నారు.

మనిషిని ప్రేమించేలా

రాజ్యాంగం రాసిన అంబేడ్కర్

కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన డాక్టర్ కత్తి పద్మారావు



డాక్టర్ పద్మారావు రచనను ఆవిష్కరించిన పిల్లి విద్యాసాగర్

తెనాలి: దళితులకు మాట్లాడే స్వేచ్ఛ, సమానత్వం సహా మనిషిని మనిషిగా ప్రేమించే రాజ్యాంగాన్ని నిర్మించిన మహోన్నతుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని దళిత ఉద్యమ నిర్మాత, ప్రసిద్ధ కవి, రచయిత డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. దళితులకు రాజ్యాధికారమే అంతిమ లక్ష్యమని అంబేడ్కర్ చాటారని తెలిపారు. పట్టణ చినరావూరుతోటలోని మదర్ థెరిస్సా నగర్‌లో అంబేడ్కర్ యూత్, విగ్రహ నిర్మాణ కమిటీ, సంఘ పెద్దల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోనే తొలిగా ఏర్పాటు చేసిన తొమ్మిది అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం రాత్రి డాక్టర్ కత్తి పద్మారావు ఆవిష్కరించారు. అనంతర సభకు కనపర్తి అబ్రహం లింకన్ అధ్యక్షత వహించారు. డాక్టర్ పద్మారావు రచించిన 91వ పుస్తకం 'మన దేశం– మన రాజ్యాంగం' పుస్తకాన్ని పిల్లి విద్యాసాగర్, 'భారతదేశ చరిత్ర'ను మండే నాగేశ్వరరావు ఆవిష్కరించారు. సభలో డాక్టర్ పద్మారావు మాట్లాడుతూ.. అంబేడ్కర్ కన్నుమూశాక 68 ఏళ్లకు ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. శూద్రులు సహా అణగారిన వర్గాల వారిని ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు డాక్టర్ అంబేడ్కర్ శపథం చేసి మరీ సాధించారని అన్నారు. ఆయన ప్రసాదించిన రాజ్యాంగంతో నేడెందరో సమాజంలో ఉన్నతస్థాయిలో ఉన్నారని గుర్తుచేశారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం వంటి హక్కులను ప్రసాదించినట్టు చెప్పారు. అంబేడ్కర్ మార్గదర్శకత్వంలో కారంచేడు, చుండూరు ఉద్యమాలతో ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ చట్టాన్ని తీసుకురాగలినట్టు చెప్పారు. ఆయన ప్రసాదించిన కలం, పుస్తకం ఆయుధంగా ఈ రోజున సివిల్స్‌కు తయారవుతున్నవారిలో 65 శాతంపైగా ఎస్సీ, ఎస్టీ, బీసీలే ఉండటం చారిత్రక మార్పుగా చెప్పారు. రాజాధికారమే అంతిమ లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు.

'అంబేడ్కర్ సూర్యుడు' బిరుదు ప్రదానం

సభలో డాక్టర్ కత్తి పద్మారావును సత్కరించి 'అంబేడ్కర్ సూర్యుడు' బిరుదును ప్రదానం చేశారు. తొలుత స్థానిక జేఎంజే మహిళా కాలేజీ నుంచి భారీ బైక్ ర్యాలీతో డాక్టర్ పద్మారావును సభాస్థలికి తోడ్కొనివచ్చారు. మన్నవ ప్రభాకర్ స్వాగతం పలికారు. వాసిమళ్ల శ్యామ్ సభాపరిచయం చేశారు. మన్నవ శాంతిశ్రీ, దాసరి వీరవసంతరావు, అక్కిదాసు కిరణ్, కంచర్ల ఆనంద్, కారుమంచి రవికుమార్, బేతాళ ప్రభాకర్, పిల్లి గంగాధర్, బేతాళ భూషణం, కనపర్తి అనిల్, మేకతోటి ప్రభాకరరావు, కన్నెగంటి రమేష్‌బాబు, బోరుగడ్డ సురేష్, పీసీహెచ్ వెంకయ్య, గొల్లా మాణిక్యరావు, గారపాటి బాలస్వామి, కర్రా రాజారత్నం, మేరుగ సంజీవరావు, నీలా విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. విగ్రహావిష్కరణలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కూడా పాల్గొని, అంబేడ్కర్‌కు పుష్పాంజలి ఘటించారు.

రైతులను ఆదుకోవటంలో కూటమి ప్రభుత్వం విఫలం

- రైతుల సమస్యలపై 11న జిల్లా కేంద్రాలలో నిరసన
- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



రేపల్లె రూరల్: కూటమి ప్రభుత్వం రైతులను నట్టేటా ముంచిందని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ విమర్శించారు. గుళ్లపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కారన్నారు. ఖరీఫ్‌కు ముందుగానే పెట్టుబడి సాయంగా రూ.20వేలు అందించి రైతులకు అండగా ఉంటామని చెప్పి ఇచ్చిన హామీని అమలు చేయటంతో తీవ్రంగా విఫలమయ్యారన్నారు. ప్రభుత్వం సాయం అందించకపోవటంతో రైతులు, కౌలు రైతులు పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోతే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తక్షణమే ఆదుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. ప్రస్తుతం పంట చివరి దశలో వచ్చిన తుపానుతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు అలంకార ప్రాయంగా ఉన్నాయన్నారు. తేమ శాతం సాకు చూపుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయటంలేదన్నారు. ఇదే అదునుగా భావించిన మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకుండా నిరాకరిస్తుండటంతో రైతులు నష్టపోతున్నారన్నారు. రైతుల పక్షాన నిలబడి పోరాటం చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారన్నారు. రైతులకు న్యాయం జరిగేలా పోరాటాలను ఉధృతం చేస్తున్నామని చెప్పారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు అందించటంతోపాటు నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దీనిలో భాగంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 11వ తేదీన జిల్లా కేంద్రాలలో తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలలో నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రోగి సంతృప్తే ప్రధానం



మాట్లాడుతున్న డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్: అత్యంత ప్రాచుర్యం పొందిన మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స అనంతరం రోగి సంతృప్తికరంగా ఉండడం అనేది వైద్యుడి ప్రధాన కర్తవ్యం అని ప్రముఖ కీళ్ల మార్పిడి వైద్య నిపుణులు, సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి అన్నారు. మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించడం ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న సమయంలో ఆపరేషన్ తరువాత రోగి అస్థిరత్వానికి గురి కాకూడదని తెలిపారు. శుక్రవారం బెంగళూరులో జరిగిన 69 వ ఇండియన్ ఆర్థోపెడిక్ జాతీయ సదస్సు (ఐఓఏకాన్)లో ఇన్‌స్టబిలిటీ ఆఫ్టర్ టీకేఆర్ అనే అంశంపై డాక్టర్ నరేంద్ర రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. దేశ వ్యాప్తంగా ఆరువేల మందికిపైగా ఎముకలు, కీళ్ల వైద్య వైద్యులు సదస్సుకు హాజరయ్యారు. సదస్సులో డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స తర్వాత అతి కొద్దిమంది మాత్రం తరచూ కొన్ని సమస్యలను వ్యక్తపరుస్తున్నారని వెల్లడించారు. దీనిపై తన పరిశోధన, పరిశీలన సుదీర్ఘకాలం కొనసాగిందని చెప్పారు. మోకీలు మార్పిడిలో ఇంప్లాంట్‌ను అమర్చడం, అవసరం మేరకు ఎముకను కట్ చేయడం అనేది ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. ఈ నేపథ్యంలో వాటి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రోగి శరీరతత్వంపై కూడా అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ నరేంద్ర రెడ్డి వివరించారు.

సాగులో ఏటీఎం విధానంతో నిరంతర ఆదాయం

- ప్రకృతి సాగు విభాగం పల్నాడు జిల్లా డీపీఎం కె. అమలకుమారి
- సంగంగోపాలపురంలో ప్రకృతి పంటల పరిశీలన



సంగంగోపాలపురంలోని ప్రకృతి సాగుని పరిశీలిస్తున్న డీపీఎం కె అమలకుమారి

యడ్లపాడు: సాగులో ఏటీఎం (ఎనీ టైం మనీ) విధానంతో రైతులు నిరంతర ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం పల్నాడు జిల్లా డీపీఎం కె. అమలకుమారి చెప్పారు. యడ్లపాడు మండలాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంగంగోపాలపురంలోని రైతు రామకృష్ణ ఏటీఎం మోడల్ ప్రకృతి వ్యవసాయ పంటను పలువురు రైతులతో కలిసి పరిశీలించారు. 40 సెంట్ల విస్తీర్ణంలో అన్ని రకాల ఆకు కూరలు, కూరగాయ పంటల్ని సాగు చేయడాన్ని వివరించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగం లేకుండా మంచి పోషకాల కలిగిన ఉత్పత్తుల్ని పండిస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా వాటిని విక్రయిస్తూ ఆదాయాన్ని పొందుతున్నట్లు తెలిపారు. ఈ విధానం సాగుతో అటు నేలకు, ఇటు వినియోగదారులకు అనారోగ్య సమస్యలు వాటిల్లవని వివరించారు. పల్నాడు జిల్లాలో ఈ ఏడాది 39,113 మంది రైతులు 42312 ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌పీ సైదయ్య, అప్పలరాజు, నందకుమార్, మేరి, సౌజన్య, మాస్టర్ ట్రైనర్లు జయలక్ష్మి, మధుబాబు, స్థానిక రైతులు పాల్గొన్నారు.